క్లుప్తంగా

నూతన నియామకం

కందుకూరు: సీపీఐ కందుకూరు మండల కార్యదర్శిగా కందుకూరుకు చెందిన కొమ్ముగల రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహేశ్వరంలో నిర్వహించిన సీపీఐ మండల మహాసభలో ఆయనను ఎన్నుకున్నట్లు నియోజకవర్గ కార్యదర్శి బి.దత్తునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతనం కార్యదర్శి మాట్లాడుతూ.. ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ పెద్దలకు, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల వారి శ్రేయస్సు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.23, వంకాయ రూ.28, బెండ రూ.55, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.28, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.40, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.23, అరటి కాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.28, మునగ రూ.85, కందగడ్డ రూ.45, బీట్‌రూట్ రూ.25, కీర రూ.35, బీన్స్ రూ.85, క్యాప్సికమ్ రూ.60. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


పనులు పరిశీలిస్తున్న నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అలాగే కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు పనులను పర్యవేక్షిస్తూ ఉండాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఆటోసాయినగర్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను శనివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈ హేమునాయక్, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు పార్వతి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్మశానవాటికలో వసతుల కల్పనకు కృషి


శ్మశాన వాటికను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఎల్‌బీనగర్: సాహెబ్‌నగర్ శ్మశాన వాటికను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఈ శ్మశాన వాటిక అభివృద్ధిపై గతంలో జోనల్ కమిషనర్‌కు వినపత్రం ఇచ్చామని అందులో భాగంగా శనివారం ఈఈ రమేష్‌బాబు, డీఈ దామోదర్ రావుతో కలిసి కార్పొరేటర్ శ్మశాన వాటికను పరిశీలించారు.ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. శ్మశాన వాటికలో మంచినీరు, మూత్రశాలలు ఏర్పాటు చేయడంతో పాటు మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ గోపాల కృష్ణ, డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

అవయవదానానికి ముందుకు వచ్చిన కుటుంబం


పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న శివకుమార్ కుటుంబం

కందుకూరు: అవయవదానం చేయడానికి కానిస్టేబుల్ తన కుటుంబ సభ్యులతో సహా ముందుకొచ్చి ఆదర్శంగా నిలిచాడు. మండలంలోని నేదునూరు పంచాయతీ పరిధి మాన్యగూడకు చెందిన ముద్దంగుల శివకుమార్.. ప్రస్తుతం అంబర్‌పేట హెడ్ క్వార్టర్‌లో ఆర్మ్‌డ్ ఫోర్స్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా గతంలో అతను నెహ్రూ యువ కేంద్రంలో పని చేసేవాడు. పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిలోని జీవన్‌ధాన్ ట్రస్ట్‌కు శనివారం కుటుంబ సభ్యులందరినీ తీసుకెళ్లి, తమ మరణానంతరం అవయవాలను దానం చేస్తున్నట్లు అంగీకార పత్రాలపై సంతకాలు చేసి ట్రస్ట్ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్‌కు చెందిన కందకట్ల సిద్దారెడ్డి చేస్తున్న సమాజ సేవను ఆదర్శంగా తీసుకుని, ఆయన స్ఫూర్తితో ముందుకొచ్చామని తెలిపారు.

దర్జాగా కలప దందా

యథేచ్ఛగా అడవుల నరికివేత

- తరుగుతున్న పచ్చదనం
- పట్టించుకోని అటవీ శాఖ


తుక్కుగూడ ఔటర్ సర్వీస్ రోడ్డులో అక్రమంగా తరలుతున్న కలప

తుక్కుగూడ: పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం, అడవుల శాతం పెంచేందుకు ఓ వైపు ప్రభుత్వాలు కృషి చేస్తుండగా.. మరో వైపు కలప దొంగలు రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా చెట్లను తెగనరుకుతూ కలపను కొల్లగొడుతున్నారు. దర్జాగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

వాల్టా చట్టానికి తూట్లు

తుక్కుగూడ మున్సిపాలిటీ ప్రాంతం నగరానికి అతి సమీపంలో ఉండటంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో ప్రాంత రైతులు వారివారి వ్యవసాయ భూములను పూర్తిగా విక్రయిస్తున్నారు. ఆ భూములను కొనుగోలు చేసిన రియల్టర్లు.. చెట్లను నరికి, వెంచర్లు వేస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న కలప వ్యాపారులు వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. అటవీ, రెవిన్యూ శాఖ అధికారులు అనుమతులు లేకుండా చెట్లను కూలదోస్తూ.. ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తుక్కుగూడ, మంఖాల్, రావిర్యాల, బాసగూడతండా, హర్షగూడ తదితర ప్రాంతాల్లో కలప వ్యాపారం జోరుగా సాగుతుండటంతో.. పచ్చదనం నానాటికీ తగ్గుతోందని, ఇంత జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అక్రమ కలప రవాణాకు అడ్డుకట్ట వేసి, అడవుల పెంపకం పై దృష్టి సారించాలని పుర ప్రజలు కోరుతున్నారు.

చట్టరీత్యా నేరం

అనుమతులు లేకుండా చెట్లను నరకడం చట్టరీత్యా నేరం. ఇలాంటివి చోటుచేసుకుంటే.. మాకు సమాచారం ఇవ్వండి. మంఖాల్ రేంజ్ పరిధిలో అక్రమ వ్యాపారులను గుర్తించి, కేసులు నమోదు చేశాము. జరిమానా విధించాం

– ప్రభాకర్, ఫారెస్టు రేంజ్ అధికారి, మంఖాల్

ఆయిల్‌పామ్ సాగు.. ఆదాయం బాగు



ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్

కందుకూరు: పామాయిల్ సాగును విస్తృతంగా చేపట్టి, ప్రభుత్వం అందించే ప్రయోజనాలతో లబ్ధి పొందాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్ సూచించారు. శనివారం మండల పరిధిలోని సరస్వతిగూడలో రైతు జి.పాండురంగారెడ్డి పొలంలో మూడు ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ మొక్కలను ఉద్యాన శాఖ అధికారుల ఆధ్వర్యంలో నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుతో ఆదాయం ఎక్కువగా వస్తుందని రైతులు ఆ దిశగా ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, ఎంపీడీఓ సరిత, ఉద్యాశాఖ అధికారి సౌమ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎం.హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


పార్టీలో చేరిన వారితో నాయకులు

మహేశ్వరం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి చిన్నతూప్ర, కల్వకోల్ గ్రామాల్లో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించి, పార్టీని బూత్, గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అంతకు ముందు పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, అఫ్జల్‌బేగ్, గొల్లూరు రాజు, ఎండి.ఆదిల్, జంగయ్య, రామిరెడ్డి, ఖాజామొయినుద్దీన్, కృష్ణారెడ్డి, అనిల్, మహ్మద్ గయాస్, మహ్మద్ ఇలియాజ్, అశోక్, రమేష్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంకు

- భయాందోళనకు గురవుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు


ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంకు

మహేశ్వరం: గత కొన్నేళ్లుగా గ్రామానికి తాగు నీటిని అందించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. అది కూలి ఎలాంటి ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్‌ను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

30 ఏళ్ల క్రితం..

మండల పరిధిలోని పెండ్యాలలో గత 30 సంవత్సరాల క్రితం ఎస్సీ బస్తీని ఆనుకొని నిర్మించారు. ట్యాంకు పైకప్పు బీటలువారి, పెచ్చులూడి, ఇనుప చువ్వలు శిథిలావస్థకు చేరి పైనుంచి నీరు కారుతూ ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్తులు బిక్కుబిక్కుమంటున్నారు. గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆ వాటర్ ట్యాంకులో నీటిని నింపి గ్రామ అవసరాలకు వాడుతున్నారు. దాని పక్క నుంచి నిత్యం ప్రజలు నడుస్తుండంతో పాటు ఖాళీ స్థలంలో చిన్నపిల్లలు ఆడుకుంటుంటారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం కావడంతో ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌ను కూల్చివేసి, కొత్తగా నిర్మాణం చేయాలని గ్రామస్తులు ఇటీవల అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకును కూల్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పెండ్యాలలో వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందనే విషయం తెలిసింది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ అధికారులతో ట్యాంకును పరిశీలించిన తర్వాత చర్యలు తీసుకుంటాం. అధికారుల ఆదేశాలతో దాని స్థానంలో కొత్త వాటర్ ట్యాంకు నిర్మించేందుకు కృషి చేస్తాం. అధికారులను గ్రామానికి పంపించి వివరాలు సేకరిస్తాం.

– జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, మహేశ్వరం

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల పరిశీలన


పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న మజ్లిస్ నాయకులు

పహాడీషరీఫ్: మజ్లిస్ పార్టీ కృషితో జల్‌పల్లి మున్సిపాలిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆ పార్టీ సీనియర్ నాయకుడు హసన్ షా అన్నారు. ఎర్రకుంట 1వ వార్డులో కొనసాగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. గడిచిన ఐదేళ్లలో ఎర్రకుంటలో కోట్లాది రూపాయల వ్యయంతో డ్రైనేజీ, సీసీ, బీటీ రోడ్డు నిర్మాణ పనులు జరిగాయని తెలిపారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ చైర్మన్ అబ్దుల్లా సాదిలు ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో నిధులు తెచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు దయాని, హుస్సేన్ బా ఇస్మాయిల్, మహ్మద్ యాఫై, గఫార్, అల్ జాబ్రీ, నాసర్ జాబ్రీ, ముక్తార్, జావెద్, అబ్దుల్లా, హఫాజ్ పాల్గొన్నారు.

ఘనంగా వారాహీదేవి నవరాత్రులు


ఎమ్మెల్యే సబితారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురంలోని కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా దేవి దేవాలయంలో వారాహీదేవి నవరాత్రులులో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయం సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ సబితా ఇంద్రారెడ్డి కి తీర్థ ప్రసాదాలు, అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అరవింద్ శర్మ, నగేష్, శ్రీనివాస్ రెడ్డి, డా. రామ్ నరసింహ గౌడ్, కొంద్ర శ్రీనివాస్, సాజిద్, వెంకటేష్ గౌడ్, కంచర్ల శేఖర్, ముచ్చింతల జగన్,పెంబర్తి శ్రీనివాస్, లిక్కి ఊర్మిళ రెడ్డి, నవీన్, దేవాలయ సిబ్బంది విఠల్ శర్మ, నిఖిల్ శర్మ, సువర్ణలత పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి


వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: పాతబస్తీలో అంగరంగ వైభవంగా నిర్వహించుకునే బోనాల మహోత్సవాలు ప్రారంభమైనందున సైదాబాద్ డివిజన్ పరిధిలోని అమ్మవారి దేవాలయాలకు బోనాల నిధులు త్వరగా విడుదల చేయాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఆమె దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బోనాల మహోత్సవాలు పురస్కరించుకొని అయా దేవాలయాల కమిటీల వారు అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతారని, ఆలయాల ప్రాంగణాల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తారన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న దామోదర్ రెడ్డి

నాగోలు: ప్రజా సమస్యల పరిష్కారంపై కమ్యూనిస్టులు నిరంతరం పోరాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర సమితి సభ్యులు జీ. దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ ఉప్పల్ మండల 6 శాఖలు (ఉప్పల్,రామంతపూర్, మోహన్ నగర్, నాగోలు, జైపురి కాలనీ 1, 2 శాఖల) సమావేశం శనివారం న్యూనాగోలులోని ఎస్‌కే డాంగే భవన్‌లో మండల కార్యదర్శి టి. సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జీ. దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్‌లో ఆగస్టు 19–22 వరకు జరగనున్న సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను పంచుతూ ప్రజలను మమేకం చేయాలని తద్వారా విరివిగా విరాళాలను సేకరించాలని కోరారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి వరకు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్నది కమ్యూనిస్టు పార్టీలే అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఉపన్యాసాలు ఇస్తున్నారే కానీ కొత్త ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ధర్మేంద్ర, ఎండీ. బషీర్, నారాయణ, కృష్ణ, రాజేందర్, పరమేశ్వర, మల్లేష్, ఉష శ్రీ, జంగారెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

నేడు వైద్య పరీక్షలు

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ డక్కన్ మెడికల్ హాల్ ఆధ్వర్యంలో నేడు వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగే శిబిరంలో కేవలం రూ. 10కే అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తారన్నారు.

6న రాష్ట్రస్థాయి రచన పోటీలు

మన్సూరాబాద్: చిమ్మపూడి ఫౌండేషన్ (సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ) ఆధ్వర్యంలో జూలై 6న విద్యార్థులు రాష్ట్రస్థాయి వచన కవిత రచన పోటీలను నగరంలోని త్యాగరాయగాన సభలో నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీరామమూర్తి చిమ్మపూడి తెలిపారు. 10వ తరగతి ఆపై తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చని విజేతలకు రూ.5 వేల నగదు పారితోషకం ఉంటుందని ఈ నెల30 లోపు 97041 77270 నెంబర్‌కు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సీజీనల్ వ్యాధులపై అవగాహన

మన్సూరాబాద్: డివిజన్ పరిధి కాస్మోపాలిటన్ కాలనీలోని చైతన్య భారతి హైస్కూల్‌లో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం సీజీనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో పాటు ఎంటమాలజీ ఎఈ రవీంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. వర్షాకాలంలో ఇంట్లో ఉండే మొక్కల కుండీల్లో, సంపుల్లో నీటిని నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు.

నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు


అన్నమ్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నాగోలు: నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని, ప్రభుత్వ రంగంలోని ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు పేర్కొన్నారు. నాగోలు డివిజన్ బండ్లగూడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అన్నమ్మ పదవీ విరమణ సన్మాన సభను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామారావు, అన్నమ్మ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా అన్నమ్మ మాట్లాడుతూ.. నా సర్వీసులో తరగతి గదే పరమావధిగా బతికానని ఈ ఉపాధ్యాయ వృత్తి నేర్చుకోవడానికి కారణం నా తల్లిదండ్రులు ఉపాధ్యాయులే కావడం అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు పద్మారావు, పిచ్చిరెడ్డి, బత్తుల శ్రీనివాస్‌రెడ్డి, రామేశ్వర్, ఆనందెడ్డి, వివిధ పార్టీల నాయకులు తూర్పాటి చిరంజీవి, చెరుకు భవానీ శంకర్ గౌడ్ ఉన్నారు.

మహిళాభివృద్ధికి ప్రత్యేక పథకాలు


కుట్టు మిషన్ పత్రాలు అందజేస్తున్న నాయకులు

హయత్‌నగర్: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేస్తుందని పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. రేవంతన్న భరోసా పథకంలో భాగంగా శనివారం హయత్‌నగర్‌లో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 200 మంది మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా ప్రభుత్వం పని చేస్తుందని ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. చదువుకున్న మహిళలు, యువకులకు వారి ఆసక్తి ఉన్న రంగాల్లో సహకరిస్తున్నామని, పేద విద్యార్థులు విదేశాలలో చదివేందుకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామన్నారు. మధుయాష్కిగౌడ్ మాట్లాడుతూ.. మహిళల ఓట్లుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్ని రంగాలలో వారు అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డిరాంరెడ్డి, ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్, క్రిష్టియన్ మేనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ పాల్గొన్నారు.

పీవీ సేవలు చిరస్మరణీయం


పీవీ నర్సింహారావు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి


పీవీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు రైతు కుటుంబం నుంచి దేశ ప్రధాని వరకు ఎదిగిన మహానేత అని మహేశ్వరం నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకుని ఆర్‌కేపురం డివిజన్‌లో అల్కాపురి పీవీ నరసింహారావు చౌరస్తాలో ఏర్పాటు చేసిన వేడుకల్లో దేప భాస్కర్ రెడ్డి పాల్గొని పీవీ విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ మట్టిలో పుట్టిన పీవీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నేత, బండి మధుసూదన్ రావు, సురేష్, తలాటి రమేష్ నేత, రాజు నాయక్, ధనరాజ్ గౌడ్, యాదవ రెడ్డి, ముప్పిడి లింగస్వామి గౌడ్, పగడాల ఎల్లన్న, రామకృష్ణ గౌడ్, పగడాల శ్రీశైలం, ప్రేమ్ నాయక్, నబీ పాల్గొన్నారు.

అల్కాపురి చౌరస్తాలో..

ఆర్థిక సంస్కరణల ధీశాలి, అప్పుల భారతాన్ని అభివృద్ధి వైపు నడిపించిన రాజనీతిజ్ఞుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం పీవీ జయంతిని పురస్కరించుకొని ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురి చౌరస్తాలోని పీవీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. భారతదేశాన్ని పునర్నిర్మించిన నిజమైన నాయకుడన్నారు. పీవీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అరవింద్‌శర్మ, పెండ్యాల నగేష్, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, రామ్ నరసింహ గౌడ్,కంచర్ల శేఖర్, కొంద్ర శ్రీనివాస్, సాజిద్, ముచ్చింతల జగన్, వెంకటేష్ గౌడ్, మహేందర్ రెడ్డి, శంకర్ నాయక్, పెంబర్తి శ్రీనివాస్, నవీన్, ఊర్మిల రెడ్డి పాల్గొన్నారు.